దారిద్ర్యం వదులుతోంది

కూటమి సర్కారు రాకతో రోడ్ల పనులకు గ్రీన్‌సిగ్నల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా రహదారుల పనులు

కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం

4



సూక్ష్మం.. జాప్యం..!

- డ్రిప్ పరికరాల కోసం రైతుల నిరీక్షణ
- మార్గదర్శకాలు జారీ చేయని ప్రభుత్వం
- వైసీపీ విధానాల అమలుతో తీవ్ర నష్టం
- ఐదెకరాలు దాటితే 70 శాతమే సబ్సిడీ
- డబ్బు చెల్లించినా.. అందని పరికరాలు



అనంతపురం అర్బన్/ విడపనకల్లు డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం సూక్ష్మ సేద్య పరికరాల సబ్సిడీని ఇంకా ఖరారు చేయలేదు. జిల్లాలో కరువును జయించేందుకు టీడీపీ హయాంలో ఏకంగా 90 శాతం సబ్సిడీతో అప్పట్లో పరికరాలను ఇచ్చారు. పైగా పది ఎకరాల విస్తీర్ణం వరకూ వర్తింపజేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లపాటు ఈ పథకాన్ని దాదాపు అటకెక్కించింది. రైతుల నుంచి ఒత్తిడి రావడంతో చివరలో అరకొరగా విదిల్చింది. దీంతో చాలామంది రైతులు మార్కెట్‌లో అధిక ధరలకు బిందు, తుంపర సేద్య పరికరాలను కొనుగోలు చేశారు. అలా కొనే స్తోమత లేనివారు సాగు మానేయడం, విస్తీర్ణాన్ని తగ్గించుకోవడం ద్వారా నష్టపోయారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగానే వీరందరకూ ఇక తమ కష్టాలు తీరుతాయని భావించారు. కానీ ప్రభుత్వం ఇంకా మార్గదర్శకాలను జారీ చేయకపోవడంతో నిరాశ చెందుతున్నారు.

పాత పద్ధతిలోనే...

ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా రైతాంగానికి స్పష్టమైన హామీ ఇచ్చారు. సూక్ష్మ సేద్యానికి మునుపటి తరహాలో సబ్సిడీని ఇస్తామని ప్రకటించారు. దీంతో సబ్సిడీని ఎప్పుడెప్పుడు పెంచుతారా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 37,500 హెక్టార్ల విస్తీర్ణానికి డ్రిప్, స్ప్రింకర్లను మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఈ ఏడాది ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేసింది. అదే నెల నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. చాలా మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కొత్త మార్గదర్శకాలు రాకపోవడంతో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన పాత మార్గదర్శకాల మేరకే రైతులతో నాన్ సబ్సిడీ డబ్బులను అధికారులు కట్టించుకున్నారు.

కొత్త సబ్సిడీ ఎన్నడు..?

జిల్లాకు ఈ సారి భారీగా టార్గెట్ ఇచ్చారు. కానీ కొత్త సబ్సిడీ ధరలు ఖరారు చేయలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లా రైతాంగానికి సూక్ష్మసేద్యం పరికరాలకు పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీతో ఇచ్చింది. ఎస్సీ ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ వర్తింపజేసింది. వారికి ఉచితంగా డ్రిప్ పరికరాలను సరఫరా చేసింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక మార్గదర్శకాలను మార్చారు. ఐదెకరాల దాకా 90 శాతం, ఆపైన 70 శాతం సబ్సిడీని వర్తింపజేశారు. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం ఉచిత సబ్సిడీని ఎత్తేశారు. ఇతర రైతుల తరహాలోనే సబ్సిడీని వర్తింపజేశారు. దీంతో అప్పట్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సార్వత్రిక ఎన్నికల్లో పదెకరాల దాకా 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు మంజూరు చేస్తామని టీడీపీ హామీ ఇచ్చింది. ఆ హామీని త్వరగా నెరవేర్చాలని రైతాంగం కోరుతోంది. లేదంటే ఐదెకరాలకంటే ఎక్కువ పొలం ఉన్న రైతులు నష్టపోతామని అంటున్నారు. పైగా ఎస్సీ, ఎస్టీ రైతులు సైతం డబ్బులు చెల్లించి పరికరాలను కొనాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు చెల్లించినా..

ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో పలువురు రైతులు పాత పద్ధతిలోనే నాన్‌సబ్సిడీ డబ్బులు చెల్లిస్తున్నారు. అయినా వారికి పరికరాలను మంజూరు చేయలేదు. జిల్లాలో 42,459 మంది రైతులు 58,475 హెక్టార్లలో డ్రిప్, స్ప్రింకర్ల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. వీరిలో 17,850 మంది రైతులకు సంబంధించిన 21,809 హెక్టార్లలో ప్రాథమిక సర్వే పూర్తైంది. ఇందులో 6,568 మంది రైతులు 7,731 హెక్టార్లకు నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించారు. దీని ఆధారంగా 5,794 మంది రైతులకు 6,818 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేయాలని కలెక్టర్ పరిపాలన ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి దాకా 3,611 మంది రైతులకు 4,245 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేశారు. మిగిలిన రైతులు పరికరాల కోసం నిరీక్షిస్తున్నారు.



90 శాతం సబ్సిడీ ఇవ్వాలి..

నాకు 7.50 ఎకరాల పొలం ఉంది. కంది, మిరప పంట సాగు చేస్తున్నాను. ఐదు ఎకరాలకుపైగా పొలం ఉండటంతో 70 శాతం సబ్సిడీనే వర్తిస్తుందని అధికారులు అంటున్నారు. అయినా పంట సాగు కోసం సంవత్సరం క్రితం డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఇంకా మంజూరు చేయలేదు. ఈ ప్రభుత్వంలోనైనా 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేసి ఆదుకోవాలి.

- భీమలింగప్ప, కడదరబెంచి, విడపనకల్లు మండలం



ఎదురుచూస్తున్నా...

టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేస్తారని ఎదురుచూస్తున్నాం. కానీ నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించాలని అధికారులు చెబుతున్నారు. నాకు 5.03 ఎకరాల పొలం ఉంది. అందులో మామిడి, నేరుడు సాగు చేస్తున్నాను. ఐదు ఎకరాలకుపైగా ఉండటంతో 70 శాతం సబ్సిడీ మాత్రమే వర్తిస్తుందని చెబుతున్నారు. అందుకే డబ్బులు చెల్లించేక డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. సీఎం చంద్రబాబు మాపై దయచూపించి వంద శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింకర్లు అందజేసి ఆదుకోవాలి.

- చిన్న సుంకన్న, ఎస్సీ రైతు, రాచేపల్లి, శింగనమల మండలం

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలోనూ ముందుండాలి

ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ



అనంతపురం టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల ఒక రోజు ముందే చేపట్టిన సంక్షేమ పింఛన్ల పంపిణీని పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధప్రాంతాల నుంచి 306మంది బాధితులు వచ్చి తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ఇన్‌చార్జ్ కలెక్టరుతోపాటు అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్‌ఓ మలోల, డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, ఆనంద్, శిరీష, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తదితరులు అర్జీలు స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇన్‌చార్జ్ కలెక్టరు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఈనెల 31నే పంపిణీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందుకు అవసరమైన నిధులు ముందుగానే బ్యాంకులలో డ్రా చేసుకొని ఉంచుకోవాలని సూచించారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అర్జీల పరిష్కారంలో వ్యవసాయశాఖ ఫస్ట్

ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చే అర్జీల పరిష్కారంలో వ్యవసాయశాఖ మొదటి స్థానంలో ఉందని ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ తెలిపారు. రెండో స్థానంలో పబ్లిక్‌హెల్త్, మూడోస్థానంలో పంచాయతీరాజ్‌శాఖ, నాలుగోస్థానంలో విద్యుత్‌శాఖ, ఐదోస్థానంలో హౌసింగ్‌శాఖ ఉన్నాయన్నారు. ఇతరశాఖలుకూడా పోటీపడి అర్జీల పరిష్కారంలో చిత్తశుద్ధి కనబరచాలన్నారు. పోలీసు శాఖకు సంబంధించిన ఫిర్యాదులను ఓపెన్ చేయలేదని వెంటనే వాటిని ఓపెన్ చేసి పరిష్కరించాలని సూచించారు. సహకారసంఘాల సభ్యుల ఈకేవైసీ ప్రక్రియ బుధవారంలోగా పూర్తికావాలన్నారు. కంబదూరు, యాడికి మండలాలు వెనుకబడి ఉన్నాయని అక్కడ ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఈసమావేశంలో సీపీఓ అశోక్‌కుమార్, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డితోపాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు ఘననివాళి

భారతదేశ మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి జిల్లా అధికార యంత్రాంగం సోమవారం ఘనంగా నివాళులర్పించింది. రెవెన్యూ భవన్‌లో ఇన్‌చార్జ్ కలెక్టరు శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్‌ఓ మలోలతో పాటు ఇతరజిల్లా ఉన్నతాధికారులు నిమిషం పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ప్రకటించారు.

మంచి చేయాలనే తప్ప..

తిట్టాలని కాదు

మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్



తాడిపత్రి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జేసీ ఫ్యామిలీని ఈ స్థాయికి తెచ్చిన నియోజకవర్గ ప్రజలకు ఏమైనా మంచి చేయాలనే తపన తప్ప, తిట్టాలనేది తన ఉద్దేశం కాదని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నివాసంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఊరు తమ కుటుంబాన్ని ఉన్నతస్థాయికి చేర్చిందని, ఈ ఊరి ప్రజలకు మంచి చేయడానికి ఎంతదూరమైన వెళతామని ఆయన భావోద్వేగంతో అన్నారు. ఈ ఊరి ప్రజల బాగు కోసం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకుంటానే తప్ప వారిని తిట్టాలని ఉద్దేశం తనలో ఏమాత్రం లేదన్నారు. ప్రజల్లో మార్పు కోసం ఏదో తిట్టింటానే తప్ప మరోటి కాదన్నారు. ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక గోల్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. అప్పుడే మనం అనుకున్న స్థాయికి ఎదగగలమని సూచించారు. ప్రస్తుతం అందరూ ఉన్నత చదువులు చదివిన వారే ఉన్నారు. కానీ వారిలో క్రమశిక్షణ లేక పోవడంపై బాధ కలుగుతోందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించే పద్ధతులు మంచిగా ఉండాలని వారిని విచ్చలవిడిగా విడిచిపెడితే బాధ్యత లేకుండా తయారవుతా రని ఆయన హెచ్చరించారు. చదువుతోపాటు జ్ఞానం కూడా ఉండాలన్నారు. నేటి కాలంలో చదువురానివారు కూడా లక్షలు సంపాదిస్తున్నారు కానీ చదువుకున్న వారు కొందరు ఇళ్లవద్దే ఉండి తల్లిదండ్రులకు బరువుగా ఉండటం బాధాకరమని తెలిపారు. ప్రస్తుతం పిల్లలు కొందరు ఏం చేస్తున్నారంటే జాబ్ సెర్చ్‌లో ఉన్నాము అనడమే తప్ప జాబ్ చేస్తున్నామని చెప్పలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

శేషాద్రి మృతిపై విచారణ జరపాలి

న్యాయవాదులు, ప్రజా సంఘాల డిమాండ్

నగరంలో నిరసన ర్యాలీ



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

అనంతపురం క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతిపై సమగ్ర విచారణ చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, ప్రజాసంఘాల నాయకులు నగరంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్, క్లాక్ టవర్ సెంటర్లలో మానవహారం నిర్వహించారు. న్యాయవాది శేషాద్రి సీఐ చాంబర్‌లోనే మృతి చెందారని, ఈ విషయంలో ఎన్నో అనుమానాలు ఉన్నాయని అన్నారు. శేషాద్రిని పోలీస్ వాహనంలో ఆసుపత్రికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి పోలీసులు 29వ తేదీ రాత్రి వరకు కాలయాపన చేయడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. పోస్టుమార్టం విషయంలోనూ అలసత్వం వహించారని అన్నారు. శేషాద్రిని విచారణ పేరుతో రాత్రి వేళల్లో పిలిపించి, కక్షిదారుల ఎదుట అవమానించారని, అందుకే గుండెపోటు వచ్చిందని ఆరోపించారు. కనీస మర్యాద ఇవ్వలేదని, సెల్‌ఫోన్లు ఎందుకు లాగేసుకున్నారని ప్రశ్నించారు. రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేపడితే తప్ప పోస్టుమార్టం జరపలేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. పోలీసు ఉన్నతాధికారులు ఇప్పటికైనా విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, వెంకటరాముడు, నాగిరెడ్డి, పోతులయ్య, నాగన్న, బోరంపల్లి ఆంజనేయులు, చంద్ర, హరి, హనుమన్న, సుబ్బన్న, మహిళా న్యాయవాదులు, సీపీఐ ఎంఎల్ నాయకులు చంద్రశేఖర్, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి, నాయకులు రామకృష్ణ, వెంకటేశు, చంద్రబాబు, కదిరప్ప, నాగేంద్ర, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో రోడ్ల పరిస్థితి ఇలా...

- కూటమి ప్రభుత్వం ఆర్అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు మంజూరు చేసిన నిధులు - రూ.44.29 కోట్లు
- గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు: రూ. 75 కోట్లు
- విపత్తుల సమయంలో రోడ్ల మరమ్మతులకు గత సర్కార్ రూ. 139 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ. 8.26 కోట్లు ఇచ్చింది.

పీఆర్ పరంగా...

- కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారులకు మంజూరు చేసిన నిధులు : రూ. 203 కోట్లు
- గత టీడీపీ హయాంలో పీఆర్‌లోని పీఐయూ విభాగంగా పరంగా 2018-19లో కేంద్రం సహకారంతో రూ. 268 కోట్లు విడుదల చేసింది.
- గత ఐదేళ్ల వ్యవధిలో గ్రామీణ రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 316 కోట్లు.
- విపత్తుల సమయంలో రూ. 77 కోట్లు పెడితే రూ. 45 కోట్లు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీల నుంచి విడుదల చేసి మమ అనిపించింది.





తాడిపత్రి నుంచి బుక్కాపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి వేయక ముందు.. వేసిన తరువాత..

పనులకు శ్రీకారం

కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ఎస్‌డీఆర్ఎఫ్ కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.44.29 కోట్లతో 253 పనులు 3438.36 కిలోమీటర్ల మేర చేయాలని ఆదేశించింది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్అండ్‌బీలో చేసిన అరకొర పనులకు రూ.150 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారు. దీంతో పనులు చేసిన కాంట్రాక్టర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం గత సర్కార్ మాదిరిగా కక్ష సాధింపునకు దిగకుండా పెండింగ్ బిల్లులపై ఆరా తీయడంతో బాధిత కాంట్రాక్టర్లలో కొత్త ఆశలు రేకెత్తాయి. ఉమ్మడిజిల్లావ్యాప్తంగా కొన్ని బ్రిడ్జిల పనులకు కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది.

పీఆర్ పరంగా...

ఉమ్మడి జిల్లా పంచాయతీ పరిధిలోని గ్రామీణ రహదారులను గత వైసీపీ సర్కార్ ఐదేళ్లలో పట్టించుకోలేదు. తద్వారా పల్లె ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐదేళ్ల పాలనలో రెండు సార్లు మాత్రమే నిధులు మంజూరు చేశారు. అంతకు మించి ఒక్క పైసా నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఆరు నెలల వ్యవధిలోనే అనంతపురం జిల్లాకు రూ. 100 కోట్లు, శ్రీ సత్య సాయి జిల్లాకు రూ. 103 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆయా జిల్లాల అధికారులతో పాటు కాంట్రాక్టర్లు, ప్రజల్లో ఆనందం పెరిగింది.

2024 కొత్త వెలుగులు 5

దారిద్ర్యం వదులుతోంది..!

కూటమి సర్కారు రాకతో రోడ్ల పనులకు గ్రీన్‌సిగ్నల్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా రహదారుల పనులు
- కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- వైసీపీ పాలనలో ఛిద్రమైన రోడ్లు
- అరకొర పనులకు బిల్లుల చెల్లింపులోనూ జాప్యమే



పీఆర్‌లో పల్లెపండుగలో భాగంగా అనంతపురం శివారు రాజీవ్‌కాలనీలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం



బుక్కరాయసముద్రంలో జరుగుతున్న రోడ్డు పనులు

వైసీపీ పాలనలో రోడ్లపై ప్రయాణం దుర్భరంగా ఉండేది. ఐదేళ్లలో ఒక్క కొత్త రోడ్డు వేయకపోగా ఉన్న రోడ్లకు సైతం మరమ్మతులు చేయలేదు. దీంతో రోడ్లపై గుంతలు ఏర్పడి గోతులుగా మారాయి. వీటిపై ప్రయాణించడానికి ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. గుంతల రోడ్లపై ప్రయాణంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. ఎంతో మంది గాయపడ్డారు. కొందరు మృతి చెందారు. అయినా అప్పటి ప్రభుత్వంలో రోడ్లను బాగు చేయాలన్న స్పృహ ఏమాత్రం కానరాలేదు. ఏదో అక్కడక్కడ తూతూ మంత్రంగా రోడ్లను సరి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం గత ఆరు నెలల నుంచి పాడైపోయిన రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించింది. ఈక్రమంలోనే పీఆర్, ఆర్అండ్‌బీ రోడ్లను బాగు చేయడానికి కోట్ల రూపాయలు విడుదల చేసింది. ఈ నిధులతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల బీటీ, సీసీ రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. దీంతో వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఐదేళ్ల ఇబ్బందులను కూటమి ప్రభుత్వం ఆరు నెలల్లోనే తొలగిస్తోందని వాహనదారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లుల గురించి కూటమి ప్రభుత్వం ఆరా తీయడంతో కాంట్రాక్టర్లు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రోడ్లతో సందడి

కూటమి ప్రభుత్వం ఆయా శాఖల పరంగా నిధులు మంజూరు చేసి రోడ్ల పనులకు శ్రీకారం చుట్టింది. దీంతో ఉమ్మడి జిల్లాలో కొత్త రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. ఆరు నెలల వ్యవధిలోనే కూటమి ప్రభుత్వం మరమ్మతులు, రోడ్డు విస్తరణ కోసం నిధులు మంజూరు చేయడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పెండింగ్ బిల్లులపై ఆరా తీసి, నిధులన్నీ ఖర్చు చేసి ఆయా రోడ్లను సైతం వచ్చే సంక్రాంతిలోపు పూర్తి చేయాలని ఆదేశించింది. కూటమి సర్కార్ రోడ్ల అభివృద్ధిపై శ్రద్ధ చూపిస్తుండటంతో అధికారులతో పాటు కాంట్రాక్టర్లు, ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

అనంతపురం సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్లు ఛిద్రమయ్యాయి. రోడ్ల అభివృద్ధి గురించి గానీ కనీసం మరమ్మతుల గురించి గానీ గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్ల అభివృద్ధి కోసం కేంద్రం ఇచ్చే నిధులను సైతం గత ప్రభుత్వం పక్కదారి పట్టించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని (పీఆర్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖలకు చెందిన) రోడ్లు అధ్వానస్థితికి చేరాయి. వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో ఆరునెలల కిందట కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఆయా శాఖల పరంగా నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్ల పనుల సందడి మొదలైంది. ప్రధానంగా పీఆర్ పరంగా చూస్తే.. పల్లె పండుగ పేరుతో కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ. 203 కోట్లు నిధులు మంజూరు చేసింది. రోడ్ల పనులకు నిధులు మంజూరు ఆవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కాంట్రాక్టర్లలో సందడి మొదలైంది.



ధర్మవరం పరిధిలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న డీఈఈ శ్రీరాములు

ప్రస్తుతం

- అనంతపురం జిల్లాలో ఆర్అండ్‌బీ పనుల పరిస్థితి.
- రోడ్ల పనుల సంఖ్య : 134
- పనులు చేయాల్సిన కిలోమీటర్లు : 1939.12
- కూటమి ప్రభుత్వం వెచ్చించిన నిధులు : రూ. 27.76 కోట్లు
- శ్రీ సత్యసాయి జిల్లాలో ఆర్అండ్‌బీ పనుల పరిస్థితి..
- రోడ్ల పనుల సంఖ్య : 119
- పనులు చేయాల్సిన కిలోమీటర్లు : 1499.24

- కూటమి ప్రభుత్వం వెచ్చించిన నిధులు : రూ.16.53 కోట్లు
- అనంతపురం జిల్లాలో పీఆర్ పనుల పరిస్థితి..
- రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 100 కోట్లు
- పనులు చేయాల్సిన రోడ్ల సంఖ్య : 1818

శ్రీ సత్యసాయి జిల్లాలో...

- రోడ్లకు మంజూరు చేసిన నిధులు : రూ. 103 కోట్లు
- పనులు చేయాల్సిన రోడ్ల సంఖ్య : 1722



మడకశిర నియోజకవర్గంలోని భక్తరహళ్లి రోడ్డు

రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు



రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు దక్కాయి. తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటారు. రామ్‌నగర్‌లోని అనంతేశ్వర స్కేటింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్న హృత్విక్‌రెడ్డి రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. రాణ్యతార, విశ్రుత్, అవిరామ్, సహస్ర, కౌశిక్, విగ్నేష్, యోగినాథ్, ప్రతీష్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డిలు ఆయా విభాగాల్లో పతకాలు సాధించారు. కోచ్ కేదార్‌నాథ్‌తో పాటు విజేతలకు పలువురు అభినందనలు తెలిపారు.

కాంక్రీట్ పనులపై రైతుల్లో ఆందోళన

సీపీఐ నాయకుడు జగదీష్



ఇన్‌చార్జ్ కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న జగదీష్

అనంతపురం టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా రెండోదశ కాలువకు కాంక్రీట్ వేసే పనులపై రైతుల్లో ఆందోళన నెలకొందని, దీనిపై పునరాలోచించాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు జగదీష్ ఇన్‌చార్జ్ కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల వేదికలో రైతులు, రైతు సంఘాల నేతలతో కలిసి ఆయన ఇన్‌చార్జ్ కలెక్టరును కలిశారు. ఈసందర్భంగా జగదీష్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా జిల్లాలో కృష్ణాజలాలు ప్రవహిస్తుండటంవల్ల లక్షలాది ఎకరాలకు నీరు అందుతోందన్నారు. భూగర్భజలాలు పెరిగి బోరుబావులు రీచార్జ్ అవుతుండటంతో రైతులు పంటలు పండించుకుంటున్నారన్నారు. ఇపుడు కాలువకు ఇరువైపుల, అడుగు భాగంలో కాంక్రీట్ వేయాలని ప్రభుత్వం నిర్ణయించి నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. దీనివల్ల భూగర్భజలాలు పెరగక బోరు బావులు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అందుకే ఈకాంక్రీట్ పనులపై తొలుత రైతులు, రైతుసంఘాల నేతలు, అఖిలపక్ష నాయకులతో సమావేశం ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

నియామకం

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 30: ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జ్ ఈడీగా ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి నియమితులయ్యారు. సోమవారం ఇన్‌చార్జ్ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా ఉన్న సారయ్య అవినీతి, అక్రమాల నేపథ్యంలో సస్పెండ్ అయిన విషయం విదితమే. దీంతో ఆయన స్థానంలో ఎస్సీ సంక్షేమశాఖ డీడీగా విధులు నిర్వర్తిస్తున్న ప్రతాప్ సూర్యనారాయణకు ఇన్‌చార్జ్ ఈడీ బాధ్యతలు అప్పగించారు. నేడో రేపో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

చంద్రబాబుతోనే నదుల అనుసంధానం

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

అనంతపురం/రాయదుర్గం, డిసెంబరు 30: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాన నదులను అనుసంధానించడం చంద్రబాబుకే సాధ్యమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది సముద్రంలో కలిసిపోయే గోదావరి జలాలను సద్వినియోగం చేసుకొని రాయలసీమను సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు తపిస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగానే గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం జరగబోతోందన్నారు. ఎప్పటి నుంచో ప్రతిపాదనల్లోనే ఉండిపోయిన నదుల అనుసంధాన ప్రక్రియ సీఎం చంద్రబాబు చొరవతో కార్యరూపం దాల్చబోతుండటం హర్షణీయమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద తన ప్రత్యేక పలుకుబడిని విశాల ప్రజాప్రయోజనాలకు ఉపయోగిస్తున్న తీరు రాష్ట్ర భవిష్యత్తుపై చంద్రబాబుకున్న బాధ్యతకు అద్దం పడుతోందని పేర్కొన్నారు. సీమ జిల్లాల్లో ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలనే సీఎం ఆలోచనకు నిదర్శనమే ఈ నదుల అనుసంధానమన్నారు. వరద సమయంలో గోదావరి నుంచి రోజుకు రెండు మూడు టీఎంసీల నీటిని మళ్లించడం వల్ల రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. సుమారు రూ.80 వేల కోట్ల వ్యయంతో చేపట్టబోయే ప్రాజెక్టును రాబోయే మూడు నెలల్లో ప్రారంభానికి ప్రయత్నిస్తుండటం ప్రశంసనీయమన్నారు. గోదావరి జలాలతో కృష్ణా డెల్టా, నాగార్జున సాగర్ ఆయకట్టు భూములకు సాగునీరందించడం సాధ్యపడుతుందన్నారు. పోలవరం ద్వారా కృష్ణా నదికి గోదావరి జలాలు మళ్లించడంతో పాటు అక్కడి నుంచి బనకచెర్ల హెడ్ రెగ్యులేటర్‌కు నీరు మళ్లిస్తారని చంద్రబాబు చెప్పారన్నారు. తద్వారా 345 టీఎంసీల నీరు ఉపయోగించుకునే అవకాశం లభిస్తుందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను సీమ జిల్లాలకు ఎక్కువ శాతం ఉపయోగించే వీలు కల్పించే ఈ బృహత్తర పథకంతో సీమ భవిష్యత్తు పూర్తిగా మారిపోతుందన్నారు. హంద్రీనీవా, గాలేరు-నగరి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని కాలవ అన్నారు.

సొంతిల్లు కలే..!

జగనన్న కాలనీల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

- గోడలు, పునాదులకే పరిమితం
- బిల్లులు అందక ఆపేసిన లబ్ధిదారులు
- కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు



రేగాటిపల్లి సమీపాన జగనన్నకాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

ధర్మవరం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జగనన్న కాలనీల పేరుతో ప్రారంభించిన ఇళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. పునాదులు, గోడలకే పరిమితమయ్యాయి. నిర్మాణ వ్యయం బాగా పెరిగిపోవడం, కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడంతో ఇంటి నిర్మాణాలు ఆగిపోయినట్లు సమాచారం. పెరిగిన ధరల నేపథ్యంలో ప్రభుత్వం అందించే రూ.1.8లక్షల సాయం ఎంత మాత్రం సరిపడలేదని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం పట్టణ, మండల పరిధిలోని రేగాటిపల్లి, గొట్లూరు, పోతులనాగేపల్లి, కుణుతూరు, గొల్లపల్లి వంక సమీపాల్లో జగనన్న కాలనీ పేరుతో పట్టాలు మంజూరు చేసి, ఇళ్ల నిర్మాణాలు ప్రారంభింపజేశారు. అయితే ఇళ్ల నిర్మాణాలకు బిల్లులు సకాలంలో అందకపోవడం, నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో ఆర్థిక స్తోమతలేక నిర్మాణాలు ఆపేశారు. ఇళ్లు కట్టుకోకపోతే పట్టాలు రద్దు అవుతాయోమోనన్న ఆందోళనతో కొందరు డబ్బులు ఉన్నకాటికి కట్టించుకొని వదిలేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిల్లులు మంజూరు చేసి, సొంతింటి కలను నేరవేర్చాలని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎన్ని ఇళ్లు మంజూరు అయ్యాయంటే..?

ధర్మవరం పట్టణ సమీపంలో ఉన్న పోతులనాగేపల్లి, కుణుతూరు, రేగాటిపల్లి, గొల్లపల్లి వంక, గొట్లూరు గ్రామాల్లో ఇంటి పట్టాతో పాటు ఇళ్లనిర్మాణాలను మంజూరు చేశారు. కుణుతూరు వద్ద 100కు పైగా, గొల్లపల్లి వంక వద్ద 1351, పోతులనాగేపల్లి జగనన్న లేఅవుట్‌లో 4500, రేగాటిపల్లి పొలంలో 1000కి పైగా, గొట్లూరు వద్ద 100మందికి పైగా ఇంటిపట్టాతో పాటు ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో ఒక్కో ప్రాంతంలో కూడా సగానికి పైగా నిర్మాణాలు చేపట్టలేదు.

వసతుల కొరత

జగనన్న కాలనీలో వసతులు లేక లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి వెనకడుగు వేస్తున్నారు. ప్రధానంగా కుణుతూరు, గొట్లూరు, గొల్లపల్లి, రేగాటిపల్లి సమీపంలో వేసిన జగనన్న లేఅవుట్‌లలో సరైన వసతులు లేక పునాదులకే పరిమితవ ఎయ్యాయి. కాలనీల్లో ఎక్కడా కూడా నీటి వసతి కల్పించలేదు. తూతుమంత్రంగా ట్యాంకులు ఏర్పాటు చేసినా వాటికి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో అవి కాలనీల్లో దిష్టిబొమ్మల్లా మారాయి. దీంతో లబ్ధిదారులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెలుకోని కొంతవరకు ఇళ్లు నిర్మించుకున్నారు. అప్పట్లో ఒక్కో ట్యాంకర్ ధర రూ.500నుంచి రూ.700వరకు ఉండటంతో లబ్ధిదారులు అంత ధర చెల్లించకలేక ఇల్లు కట్టుకోవడానికి ముందుకు రాలేదు. కాలనీల్లో సరైన సౌకర్యాలు కల్పించలేదని, నీటి వసతి తోపాటు విద్యుత్‌సౌకర్యం లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

ఇసుక, సిమెంట్ పక్కదారి..?

ఇళ్ల నిర్మాణాలకు అప్పట్లో ప్రభుత్వం ఇసుక, సిమెంట్‌ను సరఫరా చేసింది. అయితే వీటిని పేదలకు అందించకుండా కొంతమంది అధికారులు వైసీపీ నాయకులతో కుమ్మక్కై పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మున్సిపాలిటీ అధికారులు, ఇంజనీర్ అసిస్టెంట్లు పేదలకు ఇవ్వాల్సిన ఇసుక కూపన్లు, సిమెంట్ బస్తాలను అమ్ముకున్నట్లు తెలుస్తోంది. సగం ఇళ్లకే పూర్తిస్థాయిలో ఇసుక, సిమెంట్ ఇచ్చినట్లు నమోదు చేసి మిగిలిన వాటిని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుని సొమ్ము చేసుకున్నట్లు ఆయా లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారడంతో అప్పటి సిమెంట్ లేదని ఇంకా ఈ ప్రభుత్వం మంజూరు చేయలేదని అధికారులు చెబుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సకాలంలో బిల్లులు అందిస్తాం

ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపడితే ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేస్తాం. గత పదేళ్ల నుంచి నిలిచిపోయిన ఇళ్లకు నిర్మాణాలు చేపట్టగానే విడతలవారీగా బిల్లులు లబ్ధిదారుల అకౌంట్‌లోకి జమ అవుతున్నాయి. బిల్లుల విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందకుండా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి.

\- శంకర్‌లాల్, హౌసింగ్ డీఈఈ, ధర్మవరం



గొల్లపల్లి వంక సమీపంలోని జగనన్న కాలనీలో పునాదులకే పరిమితమైన ఇళ్లు

పింఛన్లకు రూ.124.86కోట్లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ను జనవరి నెలకు సంబంధించి మంగళవారం గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా అందజేయనున్నారు. జిల్లాలో 2,84,085మంది పింఛన్‌దారులకు రూ.124.86కోట్లు నిధులు మంజూరు చేశారు. వృద్ధులు 1,39,472మందికి రూ.56.10 కోట్లు, వితంతువులు 66,354మందికి రూ. 26.77కోట్లు, చేనేతలు 6,588 మందికి రూ.2.64కోట్లు, కల్లుగీత కార్మికులు 351 మందికి రూ.14.2లక్షలు, మత్స్యకారులు 876మందికి రూ.35.లక్షలు, ఒంటరి మహిళలు 6,687మందికి రూ.2.68కోట్లు, సఫాయి కర్మచారులు 3,464మందికి రూ. 1.39కోట్లు, హిజ్రాలు 205మందికి రూ.84 వేలు, హెచ్ఐవీ బాధితులు 2,432 మందికి రూ.97లక్షలు, డప్పు కళాకారులు 3,089మందికి రూ.1.24కోట్లు, కళాకారులు 178మందికి రూ.72వేలు, దివ్యాంగులు 45,820మందికి రూ.27.63కోట్లు, కుష్ఠు బాధితులు 381మందికి రూ.22లక్షలు, మంచానికే పరిమితమైన బాధితులు 1,425మందికి రూ.2,13కోట్లు, ప్రమాద బాధితులు 1074మందికి రూ.1.61కోట్లు, అభయహస్తం 4,186మందికి రూ.21లక్షలు మొత్తం 2,84,085మందికి రూ.124.86కోట్లు నిధులు విడుదల చేశారు. పింఛన్ సొమ్మును బ్యాంకుల నుంచి సిబ్బంది సోమవారమే డ్రా చేసుకున్నారని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ నారాయణ శర్మ, డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య తెలిపారు. మొదటి రోజే పింఛన్‌దారులందరికీ పింఛన్ పంపిణీ చేస్తారని, సాంకేతిక కారణాలతో సమస్యలు వస్తే రెండో రోజు పూర్తి చేస్తారని తెలిపారు.

చీనీ టన్ను రూ. 27వేలు


అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 27,420 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10 వేలు, సరాసరి రూ. 16 వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 32 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

టమోటా కిలో రూ.7

అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 7తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు సోమవారం 1200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 5, కనిష్ఠ ధర రూ. 4 పలికినట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

చిరుత మృతి


చిరుత కళేబరం

బ్రహ్మసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ తోటలో సుమారు ఐదేళ్ల వయ సున్న చిరుతపులి మృతి చెందింది. గ్రామస్థుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మండల పశువైద్యాధికారి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో చిరుతపులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. చిరుత మృతి చెంది మూడు నాలుగు రోజులై ఉంటుందని పశువైద్యాధికారి తెలిపారు. ల్యాబ్ నుంచి రిపోర్ట్ వస్తే చిరుత మృతికి గల కారణాలు తెలు స్తాయన్నారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల జూదం.. ఆరుగురి అరెస్టు

కదిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పూల బజార్‌లోని బెస్తవీధిలోని ఇంట్లో సోమవారం పేకాట ఆడుతున్న దంపతులు, ఐదుగురు మహిళలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పేకాటపై రాబడిన సమాచారం మేరకు ఎస్ఐ బాబ్‌జాన్.. సిబ్బందితో కలిసి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, కేసు నమోదు చేశారన్నారు. జూదం కేసులో మహిళలు అరెస్టు కావడం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది.

కుటాగుళ్ల శివార్లలో..: మున్సిపాలిటీ పరిధి కుటాగుళ్ల శివార్లలో జూదం ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. వారి నుంచి రూ.8,470 స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి


సందీప్(ఫైల్)

కూడేరు, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చోళసముద్రం గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు సందీప్ (35) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు సందీప్ తమమ తోటలో ఉన్న కొబ్బరి చెట్టు పట్టలు తగిలి తరచూ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజులు ఎగిరిపోతుండటంతో సోమవారం సాయంత్రం వాటిని తొలగించేందుకు ప్రయత్నించాడు. ఈక్రమంలోనే చెట్టు ఎక్కి పట్ట కొడుతున్న సమయంలో వాటికి విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై కిందకి పడ్డాడు. పక్కనే ఉన్న మరో వ్యక్తి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న రైతుల పరుగున అక్కడికి వచ్చారు. తీవ్రంగా గాయపడిన సందీప్‌ను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సందీప్ తనకున్న మూడున్నర ఎకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. మృతుడికి భార్య రాధమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

టెండర్లలో గందరగోళం

- పాత వారికే కట్టబెట్టే ప్రయత్నం?
- సమగ్రశిక్ష ఏపీసీని నిలదీసిన టెండర్‌దారులు
- కలెక్టరేట్‌లో హైడ్రామా ● నేటికి వాయిదా


సమగ్రశిక్ష ఏపీసీని నిలదీస్తున్న టెండర్‌దారులు

పుట్టపర్తి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు తదితర వసతి గృహాలకు సరుకుల సరఫరా టెండర్ల ప్రక్రియ సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో గందరగోళంగా సాగింది. గత వైసీపీ పాలనలో సరఫరా చేసిన వారికే మళ్లీ టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారంటూ పలువురు టెండర్‌దారులు.. సమగ్రశిక్ష అతనపు ప్రాజెక్టు సమన్వయకర్త (ఏపీసీ) సంఘూర్ణను నిలదీశారు. దీనిపై రాత్రి పొద్దుపోయేదాకా కలెక్టరేట్‌లో హైడ్రామా నడిచింది. జిల్లాలోని వసతి గృహాలకు సరుకులు, చికెన్, గుడ్లు, ఆకుకూరలు, పండ్లు, పాల సరఫరాకు ఈనెల 21న టెండర్లు పిలిచారు. సోమవారం మధ్నాహ్నందాకా బుక్కపట్నంలోని సమగ్రశిక్ష ఏపీసీ కార్యాలయంలో టెండర్లు స్వీకరించారు. సాయంత్రం సీల్డ్ టెండర్లను కలెక్టరేట్‌లో తెరిచారు. టెండర్లలో 16 మందిదాకా పాల్గొన్నారు. అనుభవం తదితర సాకులు చూపుతూ గతంలో సరఫరా చేసిన వారికే మళ్లీ టెండర్లు కట్టబెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారని పలువురు టెండర్‌దారులు ఆరోపించారు. టెండర్లలో తాము తక్కువకు కోట్ చేసినా సాకులు చూపుతూ పక్కన పెడుతున్నారని మండిపడ్డారు. పాత వారికి ఎలా కట్టబెడతారంటూ టెండర్లలో పాల్గొనేందుకు వచ్చిన హిందూపురానికి చెందిన టీడీపీ నాయకులతోపాటు పలువురు టెండర్‌దారులు.. సమగ్రశిక్ష ఏపీసీ సంఘూర్ణను నిలదీశారు. అనర్హులకు కట్టబెట్టాలని చూస్తే కలెక్టరేట్‌లో ధర్నా చేస్తామని హెచ్చరించారు. సాయంత్రం మొదలైన టెండర్ల రభస రాత్రి పొద్దుపోయే కొనసాగుతూనే ఉంది. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ కలుగజేసుకుని టెండర్లను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతగత వారికి ఇస్తామని చెప్పడంతో టెండర్లుదాఖలు శాంతించారు. గందరగోళం నడుమ టెండర్ల ప్రక్రియను మంగళవారానికి వాయిదా వేశారు.

నిమ్మ ధరలు.. పతనం..!

- ఇతర జిల్లాల నుంచి తాడిపత్రికి నిమ్మకాయలు
- రెండు నెలల క్రితం రూ.4వేలు పలికిన ధర
- ప్రస్తుతం రూ.500 నుంచి 1500..

గిట్టుబాటు కాలేదని రైతుల ఆందోళన


నిమ్మ బస్తాలు

తాడిపత్రి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నిమ్మధరలు భారీగా పడిపోయాయి. రైతులకు కనీసం గిట్టుబాటు కావడం లేదు. ఇలాగే ఉంటే అప్పుల పాలు కావాల్సిన పరిస్థితి ఎదురవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, యాడికి, పెద్దపప్పూరు, నార్పల మండలాల్లో ఎక్కువగా సాగుచేశారు. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు బస్తా రూ.3500 నుంచి 4వేల వరకు ఉండేదని, రెండునెలల నుంచి దారుణంగా పడిపోయిందని రైతులు చెబుతున్నారు. సంచి రూ.30, ఆటో బాడుగ రూ.50, కూలీ రూ.300 ఇలా.. ఒక బస్తాకు దాదాపు రూ. 400 ఖర్చు అవుతుంటే.. మార్కెట్‌లో రూ. 500 నుంచి రూ.1500 పలుకుతోంది. నాసిరకం కాయలయితే రూ. 200 నుంచి రూ. 300 పలుకుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కనీసం కూలీలకు పెట్టిన ఖర్చులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి కూడా రాకపోతే అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. మరో రెండునెలలు ఇలాగే ఉంటుందని వ్యాపారులు చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌కు ఇతర ప్రాంతాల కూడా నుంచి కూడా కాయలు వస్తుండడంతో ధరలు మరింత పడిపోయాయి. అనంతపురంతోపాటు ఇతర ప్రాంతాల మార్కెట్లకు తీసుకువెళదామంటే అక్కడ మరింత తక్కువ ధరలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. నెల్లూరు, కడప, అనంతపురం, నంద్యాల, కర్నూలు, ప్రకాశం జిల్లాల నుంచి నిమ్మకాయలు తాడిపత్రి మండీలకు వస్తున్నాయి. ఇక్కడి నుంచి సుమారు 3వేల బస్తాలు గుజరాత్, పూణె, షోలాపూర్, కేరళ, తిరుచ్చి, మధురై, మైసూర్, బళ్లారి, హోస్పేట్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. నిమ్మ కాయల ధరలు తగ్గడానికి చలికాలమే ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఊరగాయకు తప్ప మిగతా వాటికి తక్కువ మోతాదులో వాడకం ఉంటుందని, అందువల్ల ధరలు తక్కువగా ఉంటాయని అంటున్నారు. దిగుబడి ఎక్కువగా రావడం కూడా మరో కారణంగా చెబుతున్నారు.

కూలి డబ్బులు కూడా రాలేదు



నాకున్న ఒకటిన్నర ఎకరాల పొలంలో నిమ్మచెట్లు సాగుచేశాను. దిగుబడి వచ్చినా.. ధర లేకపోవడంతో కూలీ డబ్బులు కూడా రావడం లేదు. పండిన పంటను ఏదో విధంగా మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకోవాలని కష్టపడుతున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. గిట్టుబాటు అయినా, కాకపోయినా కాయలను మాత్రం మార్కెట్‌కు తరలించక తప్పదు.

- సూర్యనారాయణరెడ్డి, నాయకునిపల్లి, పుట్లూరు మండలం.

తాడిపత్రిలోనే మంచి ధర



ప్రతి సంవత్సరం నిమ్మకాయల ధరలు 8నెలలు బాగా పలుకుతాయి. నాలుగు నెలలు తగ్గుతుంటాయి. కానీ ఈ ఏడాది 10 నెలలు ధర బాగా పలికింది. రెండునెలలుగా ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రాయలసీమలోనే తాడిపత్రిలో అత్యధికంగా ధర పలుకుతుండడంతో.. అనంతపురం జిల్లాతోపాటు కర్నూలు, కడప, నంద్యాల, ప్రకాశం, నెల్లూరు, పొదిలి, చీమకుర్తి తదితర ప్రాంతాల వారు ఇక్కడికి తీసుకు వస్తున్నారు. ఇక్కడి నుంచి గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తాం.

- శేఖర్, మండీ వ్యాపారి

నిర్లక్ష్యం.. నెరవేరని లక్ష్యం..!

- నిరుపయోగంగా డంపింగ్ యార్డు
- పట్టించుకోని అధికారులు


గొర్రెలకు నిలయంగా చిక్కేపల్లి చెత్త సంపద తయారీ కేంద్రం

యాడికి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇదేదో గొర్రెల పెంపక కేంద్రం అనుకుంటున్నారా... బోర్డును పరిశీలిస్తే ఇది చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం అని అర్థమవుతుంది. అధికారుల నిర్లక్ష్యంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఎలా నిరుపయోగంగా మారుతున్నాయో చెప్పడానికి నిదర్శనం ఈ చిత్రం. లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి ప్రభుత్వం వీటిని నిర్మించింది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అవి నిరుపయోగంగా మారాయి. యాడికి మండలం చిక్కేపల్లిలో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. ప్రారంభంలో కొంతకాలం నిర్వహించారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. గొప్పల కోసం వీటికి రంగులు మార్చారు. గ్రామాల్లో చెత్త సేకరణ మాత్రం జరగలేదు. గొర్రెల కాపరులు వీటిని ఇలా ఉపయోగించుకుంటున్నారు. ఇప్పటికైనా తయారీ కేంద్రాల లక్ష్యం నెరవేరేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

డీఆర్ఎం సీఎస్ గుప్తా హాజరు


డీఆర్ఎం సీఎస్ గుప్తాను సన్మానించిన ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు

గుంతకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డివిజనల్ రైల్వే మేనేజరుగా నియమితులైన సీఎస్ గుప్తా సోమవారం డీఆర్ఎం కార్యాలయంలో హాజరయ్యారు. ఇక్కడ మేనేజరుగా పనిచేస్తున్న విజయకుమార్ స్థానంలో బెంగళూరు మెట్రో రైల్ సర్వీస్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరుగా విధులు నిర్వర్తిస్తున్న సీఎస్ గుప్తాను నియమిస్తూ 26వ తేదీన రైల్వే మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు వెలువరించిన సంగతి విదితమే. ఈ మేరకు గుప్తా గుంతకల్లు డీఆర్ఎం కార్యాలయానికి వచ్చి రిపోర్టుచేశారు. అయితే డీఆర్ఎం విజయకుమార్ నుంచి సోమవారం చార్జ్ తీసుకోలేదు. త్వరలో ఈయన చార్జ్ తీసుకుని, విధుల్లో చేరనున్నారు. డీఆర్ఎం కార్యాలయానికి వచ్చిన గుప్తాకు ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్, ఏడీఎస్ మల్లికార్జున ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు ఆహ్వానం పలికి, ఘనంగా సన్మానించారు.

కందిపోతున్న రైతులు

- భారీగా పడిపోయిన ధర
- గిట్టుబాటు ధర కోసం అన్నదాతల ఎదురుచూపు


మార్కెట్ యార్డులో ఆరబెట్టిన కందులు

ఉరవకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ధరలు లేక కంది రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. క్వింటా రూ.12వేల దాకా ధర ఉండటంతో ఉరవకొండ ప్రాంతంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో అధికంగా కంది పంటను సాగు చేశారు. ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాల్లో సుమారుగా 27,334 ఎకరాలలో కంది పంటను సాగు చేశారు. వజ్రకరూరులో 13,845ఎకరాలు, ఉరవకొండలో 6,036ఎకరాలు, విడపనకల్లు 7,453 ఎకరాల్లోను జూలై, ఆగస్టు నెలల్లో కంది పంటను సాగు చేశారు. ఇటీవల వరుస తుఫాన్‌ల కారణంగా కంది పంట దెబ్బతిని, ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి తగ్గినట్లు రైతులు తెలిపారు. ఇప్పుడు పంటను కోసి, నూర్పిడి చేసి కందులను విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అయితే ధర సగానికి తగ్గడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు దాదాపు రూ.30వేల దాకా పెట్టుబడి పెట్టామని, దిగుబడి కూడా 5 నుంచి 6క్వింటాళ్ల దాకా వచ్చిందని, ధర తగ్గిపోవడంతో నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా ధర లేకపోవడతో ఉరవకొండప్రాంత రైతులు కందులను రాయచూరు మార్కెట్‌కు తరలిస్తున్నారు. అక్కడ మార్కెట్‌లో కూడా రూ.8వేలకు మించి క్వింటా అమ్ముడుపోవడం లేదని, వెనక్కు తీసుకురాలేక అక్కడే దళారులు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మాత్రం రేటు గిట్టుబాటు కాదని సరుకును వెనక్కు తెచ్చి కల్లాల్లోనే ఆరబోసుకుంటున్నారు. నూర్పిడి చేసిన పంటను పొలాల్లోనే రాశులు పోసుకుని గిట్టుబాటు ధర కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కంది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కందులను కొనుగోలు చేయాలి. రెండున్నర ఎకరాల్లో కంది పంట సాగు చేశా. ఎకరాకు 5నుంచి7 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. వ్యాపారులు ధరలు అమాంతం తగ్గించారు. గత ఏడాది రూ.9వేల దాకా ధర పలికింది. ప్రస్తుతం రూ.6వేల నుంచి రూ.7వేల వరకే అడుగుతున్నారు. **- అశోక్, రైతు ఉరవకొండ**

వ్యాపారులు చెప్పిన రేటుకే..



ఆరు ఎకరాలలో కంది పంట సాగు చేశా. దిగుబడి ఆశాజనకంగా ఉంది. అమ్ముదామంటే కొనే వారు లేక పంటను రాశులు పోసుకుని ఉండాల్సి వచ్చింది. తుఫాన్ కారణంగా ఎకరాకు 2క్వింటాళ్ల దాకా దిగుబడి తగ్గింది. రాయచూర్ మార్కెట్‌లో రూ.6వేలకు మించి ధర పలకడం లేదు.

- తిప్పయ్య, రైతు ఉరవకొండ

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

జనవరిలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఈ క్రాప్ చేయించుకున్న రైతులందరూ ఆర్బీకేలలో కొనుగోళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. మార్కెట్ ధర ప్రకారమే కొంటాం. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. రిజిస్ట్రేషన్లు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను కోరారు.

- పెన్నేశ్వరి, మార్క్ ఫెడ్ డీఎం

కంది కొనుగోలు వెంటనే ప్రారంభించాలి


మార్కెట్ యార్డులో కంది రాశులను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలును వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు మధుసూధన్, రంగారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో రైతులు ఆరబోసిన కందులను సోమవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్న హామీ ప్రకటనలకే పరిమితమైందన్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా ధరలు పతనమై, నష్టానికే అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. అధికారులు చొరవ తీసుకుని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, కొనుగోళ్ల ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జ్ఞానమూర్తి, శీనప్ప, కౌలురైతు సంఘం నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

3న సైన్స్ ఫెయిర్

అనంతపురం విద్య, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 3న ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోని 8,9,10వ తరగతుల విద్యార్థులు తయారు చేసిన సైన్స్, గణితం ప్రాజెక్టు నమూనాలు ప్రదర్శించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, కేజీబీవీ, మోడల్, జడ్పీ, సాంఘిక సంక్షేమ, గురుకుల పాఠశాలల గణితం, సైన్స్ టీచర్లు తమ విద్యార్థులను గైడ్ చేసి మూడు ప్రాజెక్టులను ఈనెల 2నే మండలాల్లో జరిగే సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించేలా హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలన్నారు. వీటిని డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు జిల్లా సైన్స్ అధికారి పర్యవేక్షించాలని, 3న జిల్లా సైన్స్ ఫెయిర్ విజయవంతయ్యేలా చూడాలని సూచించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 19తులాల బంగారం, రూ.10.5 లక్షల అపహరణ

హిందూపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్‌లోని భరత్ కుమార్ ఇంట్లో భారీ చోరీ జరిగింది. టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భరత్‌కుమార్ కుటుంబ సభ్యులు ఈనెల 28న బంధువుల ఊరైన కర్ణాటకలోని గుడిబండకు వెళ్లారు. వారు సోమవారం ఉదయం తిరిగి వచ్చారు. ఇంట్లోకి వెళ్లిన అరగంట తరువాత బెడ్‌రూమ్‌లోకి వెళ్లగా.. కిటికీ కడ్డీలు కత్తిరించి ఉండడాన్ని గమనించారు. అనుమానం వచ్చి మేడపైకి వెళ్లి బీరువా భద్రపరిచిన గదిని చూడగా.. తలుపులకున్న తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. బీరువాలోని 19 తులాల బంగారు ఆభరణాలు, రూ.10.5 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ అబ్దుల్ కరీం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. చోరీపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పుట్టపర్తి నుంచి క్లూస్ టీమ్ వచ్చి పరిశీలించింది. పగులగొట్టిన తాళం, కత్తిరించిన కిటికీ కడ్డీలను కూడా దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు.

చింతలాంపల్లిలో ఘర్షణ

- ఇరువర్గాలవారికి గాయాలు

గుంతకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలాంపల్లిలో స్థలం, ఆలయ దారి విషయంలో టీడీపీ, వైసీపీకి చెందిన కురుబ కులస్థుల మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. టీడీపీ వర్గీయుల్లో కేశవ, మహేశ్, సరళమ్మ, వైసీపీ వర్గీయులలో కదిరప్ప, వన్నూరప్ప, మల్లికార్జున, రవి గాయపడ్డారు. వీరిని రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకు వచ్చారు. ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం తీవ్రంగా గాయపడిన మల్లికార్జునను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలని డాక్టర్ జయవర్ధన్ రెడ్డి సూచించారు. ఈ ఘర్షణకు రాజకీయాలో సంబంధం లేకపోయినా పార్టీల పేరిట కొందరు ప్రచారం చేశారు. దీంతో వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు తరలివచ్చారు. రూరల్ పోలీసులు ఆస్పత్రికి వచ్చి వివరాలను నమోదు చేసుకున్నారు. గాయపడ్డవారి నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.


గాయపడ్డ కేశవ


మహేశ్


కదిరప్ప, వన్నూరప్ప


మల్లికార్జున

సంక్షిప్తం

జోరుగా సభ్యత్వ నమోదు

● టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



పార్టీ సభ్యత్వం చేయిస్తున్న కుంచెపు వెంకటేష్

అనంతపురం అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో అర్బన్ ప్రాంతంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్ పేర్కొన్నారు. ఆయన సోమవారం రెండో డివిజన్‌లో పలువురితో సభ్యత్వ నమోదు చేయించారు. అనంతపురం అర్బన్ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, అనతికాలంలోనే ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరి, పద్మావతి, భాస్కర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు విరాళం

అనంతపురం అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్ స్థానిక రాణినగర్‌లోని పెద్దమ్మ దేవత ఊరేగింపు ఉత్సవాలకు రూ.10,116 విరాళం అందించారు. ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, పద్మావతి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుల కుటుంబాలకు చేయూత

నార్పల, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మిత్రుల కుటుంబాలకు స్నేహితులు అండగా నిలిచారు. నార్పల మండల కేంద్రంలోని ఉయ్యాలకుంట కాలనీకి చెందిన తలారి పుల్లయ్యకు రెండు కిడ్నీలు ఫెయిల్యూర్ కావడంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న 2002-03 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి సోమవారం రూ.లక్ష అందజేశారు. అలాగే రోడ్డుప్రమాదంలో గాయాలపాలైన మరో మిత్రుడు సుబ్రహ్మణ్యాన్ని పరామర్శించి రూ. 20 వేలు అందజేశారు.

నారాయణరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా టీడీపీ కో ఆర్డినేటర్ రవీంద్ర తండ్రి నారాయణరావుకు టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పుట్టపర్తిలోని ఓ కల్యాణమండపంలో సోమవారం నిర్వహించిన నారాయణరావు సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర నాయకులు ఆలం నరసానాయుడు, తలారి ఆదినారాయణ, జేఎల్ మురళి, రామలింగారెడ్డి, గడ్డం సుబ్రహ్మణ్యం, ముంటిమడుగు కేశవ రెడ్డి, సుధాకర్‌నాయుడు, నాయకులు కూచి హరి, సిమెంట్ పోలన్న, హరికృష్ణ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

సక్రమంగా రేషన్ పంపిణీ చేయాలి

ఆత్మకూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రజలకు నిత్యవసర సరకుల పంపిణీలో అజాగ్రత్తవహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మనాయక్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డీలర్లు సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు.

డ్రైవర్ ఆత్మహత్య



కార్తీక్ (ఫైల్)

రాప్తాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లికి చెందిన ఉప్పర వెంకటేష్ కుమారుడు ఉప్పర కార్తీక్ (31) ఆదివారం సాయంత్రం శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం దాదులూరు వద్ద డిజి మాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. కనగానపల్లి పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన ఉప్పర కార్తీక్ కారు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కార్తీక్‌కు 8 ఏళ్ల క్రితం గాండ్లపర్తి గ్రామానికి చెందిన జ్యోత్స్నతో వివాహం అయింది. వారికి 10 నెలల కుమార్తె ఉంది. కారు డ్రైవింగ్ పని చేయడం వలన వచ్చే జీతం కుటుంబ పోషణకు సరిపోలేదని, అప్పులు చేయాల్సి వస్తోందని, అప్పులు చేయడం కంటే ఆత్మహత్య చేసుకోవడం మేలని కార్తీక్ పలు మార్లు భార్య జ్యోత్స్నతో చెప్పాడు. అలా చేయద్దని భార్య నచ్చచెప్పింది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో పని నిమిత్తం దాదులూరు గ్రామానికి వెళుతున్నానని భార్యతో చెప్పి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో కార్తీక్ తన బంధువు నాగరాజుకు ఫోన్ చేసి దాదులూరు సమీపంలో జాతీయరహదారి పక్కన చింత చెట్టు కింద డిజీ మాత్రలు మింగినట్లు చెప్పాడు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి కార్తీక్‌ను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి మృతి చెందినట్లు తెలిపాడు. కార్తీక్ భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపై గొయ్యి

● ఆదమరిస్తే అంతే సంగతులు
● పట్టించుకోని అధికారులు



కల్లుమడి- గుమ్మేపల్లి రోడ్డులో ఉన్న పెద్ద రంధ్రం

శింగనమల, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లుమడి-గుమ్మేపల్లి రోడ్డుపై కల్లుమడి సమీపంలో పైపు పగిలిపోవడం తో పెద్ద రంధ్రం పడింది. ఎంపీఆర్ దక్షిణ కాలువకు అను బంధంగా ఉన్న ఐదు కాలువ నుంచి పొలాలకు నీరు వెళ్లేందుకు ఈ సిమెంట్ పైప్ లైన్ ఏర్పాటు చేశారు. రోడ్డుకు అడ్డంగా వెళుతున్న ఈ పైపు దాదాపు ఏడాది క్రితం పగిలిపోయి రోడ్డులో పెద్ద రంధ్రం ఏర్పడింది. అధికారులు చొరవ చూపి పూడ్చిన సందర్భం ఇప్పటి వరకు లేదు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఏ మాత్రం అదమరిచినా ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ రంధ్రం వద్ద ఏమరుపాటుగా ప్రయాణించడంతో తరచూ ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. పలువురు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. దీంతో రోడ్డు మధ్యలో ఉన్న రంధ్రాన్ని పూడ్చాలని ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోడ్డు పక్కనే పొలాలున్న రైతులు కొన్నిరోజులు రంధ్రానికి రాళ్లు అడిపెట్టారు. కొన్ని రోజులుగా ముళ్ల కంపను అడ్డుపెట్టారు. ఇవన్నీ తాత్కాలికమని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రంధ్రాన్ని పూడ్చి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ● ఎంపీఆర్‌లో చేపపిల్లల విడుదల



ఎంపీఆర్ డ్యాంలో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

గార్లదిన్నె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. మండల పరిధిలోని పెనకచెర్ల (మిడ్‌పెన్నార్) డ్యాంలోకి సోమవారం మిషన్ ఫింగర్లింగ్ కార్యక్రమం కింద ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం ద్వారా వివిధ రకాల 12 లక్షల చేపపిల్లలను వదిలారు. జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్ నాయక్‌తో కలసి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ డ్యాం నీటిలోకి చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వంలో నామమాత్రంగా ఎనిమిది లక్షల పిల్లలు మాత్రమే వదిలి చేతులు దులుపుకున్నారన్నారు. మత్స్యకారులకు ఎలాంటి ఇన్సూరెన్స్‌లు గానీ, బోట్లు, నెట్లు తదితరాలు ప్రభుత్వం నుంచి అందకుండా చేశారని ఆరోపించారు. మిడ్ పెన్నార్ డ్యాంపై ఆధారపడి జీవనం సాగించే సుమారు 300 మత్స్యకారుల కుటుంబాలను వైసీపీ ప్రభుత్వంలో పట్టించు కోలే దన్నారు. 2014లో అప్పటి టీడీపీ ప్ర భుత్వం మత్స్యకారులకు అన్ని సహాయ సహకారాలు అందించిందన్నా రు. అలాగే ఇప్పుడు ఆదుకుంటా మని తెలిపారు. అదేవిధంగా ఎంపీ ఆర్ డ్యాంను పర్యాటకంగా అభివృద్ధి చేసి పూర్వవైభం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచు ఉషారాణి, సౌత్‌కెనాల్ డీసీ చైర్మన్ చంద్రశేఖర్, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎం పీడీఓ యోగానందరెడ్డి, ఎంఈఓ తారా చంద్రానాయక్, ఈఓఆర్డీ దామోదరమ్మ, మత్స్యశాఖ ఎఫ్‌డీఓలు ఆసిఫ్, లక్ష్మినారాయణ, మత్స్యశాఖ సంఘం జిల్లా అధ్యక్షులు నాగేష్, పాండు, నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, చితంబరప్ప, సురేష్, వడ్ల రాము, చల్లా నాగరాజు, సామాల మధు, ఎర్రిస్వామి, సుబ్బు, వెంకటేష్, వెంకట్రాముడు, రామాంజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల సమమస్యల పరిష్కారంలో
వైసీపీ విఫలం : ఎమ్మెల్యే

గార్లదిన్నె, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ విమర్శించారు. ఆమె సోమవారం ఎంపీఆర్ డ్యాం లోకి చేపపిల్లలను వదలిన అనంతరం గార్లదిన్నెలోని ఆదర్శ పాఠశాల, మైనార్టీ సంక్షేమ గురుకుల పాఠశా లను తనిఖీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు తూ... విద్యాభివృద్ధికి పెద్దపీట వేశామని వైసీపీ నాయకులు గొప్పలు చెప్పారే తప్ప చేసింది ఏమీ లేద న్నారు. ఇందుకు నిదర్శనం మైనార్టీ గురుకుల పాఠశాలకు సొంత భవనం లేకపోవడమే అన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గదుల కొరత కారణంగా చదువుకునే గదులలోనే రాత్రిళ్లు నిద్రిస్తున్నామని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. భోజనం నాణ్యంగా లేదన్నారు. పాఠశాలలో అనేక సమస్యలతో ఇబ్బం దులు పడుతున్నామని వాపోయారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారు లతో మాట్లాడారు. విద్యార్థులు సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి మైనార్టీ పాఠశాల భవనం నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఎక్కడైనా నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

● పర్యవేక్షించిన ఎస్పీ జగదీష్



దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది, పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో సోమవారం కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎస్పీ జగదీష్ దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీస్ నియామక ప్రక్రియలో భాగం గా కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన జిల్లాలోని అభ్యర్థులకు దేహదారుఢ్య (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు నిర్వహించారు. సోమవారం నుంచి జనవరి 17వరకు జరిగే ఈ ప్రక్రియకు పురుష అభ్యర్థులు 5242, మహిళా అభ్యర్థులు 1237 మందితో కలిపి మొత్తం 6479మంది హాజరు కానున్నారు. సోమవారం మొదటగా అభ్యర్థుల సర్టిఫికెట్స్ పరిశీలించాక బయోమెట్రిక్స్ తీసుకున్నారు. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్స్ తీసుకున్నారు. పరీక్షలలో భాగం గా 1600మీటర్లు, 100మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. పొరపాట్లకు తావులేకుండా ఆధునిక ఆర్‌ఎఫ్ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రతిభ ఆధారంగానే ఉద్యోగం : ఎస్పీ

ప్రతిభ, సామర్థ్యం ఆధారంగానే ఉద్యోగం వస్తుందని అభ్యర్థులు గుర్తుంచుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. దళారులు, మధ్యవర్తుల మాటలు నమ్మిమోసపోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా మోసపు మాటలు చెప్పినా డయల్-100 లేదా సమీప పోలీసులకు తెలియజేయాలన్నారు. ఏదైనా సమస్యలపై అప్పీల్ చేసుకునే వారు ప్రస్తుతం రాసి ఇచ్చి జనవరి 17న అప్పీలుకు రావాలని సూచించారు. దేహదారుఢ్య పరీక్షలకు అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఒరిజినల్ ధ్రువపత్రాలతో రావాలన్నారు. అదనపు ఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్‌బాషా, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

మీడియాకు ఆంక్షలు

కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే సమయంలో మీడియాకు ఆంక్ష లు విధించారు. లోపలికి వెళ్లండి...కానీ ఫొటోలు, వీడియాలు తీసుకోవద్దంటూ అల్టిమేటం జారీ చేశారు. వారిచ్చిన ఫొటోలనే వాడుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా తొలి రోజు మొత్తం ఎంతమందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారనే విషయంలోనూ స్పష్టత ఇవ్వలేకపోయారు. దాదాపు 300మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిసింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇలా ఆంక్షలు విధించడంపై విమర్శ లు వ్యక్తమవుతున్నాయి. మొదటి రోడ్డు నుంచి పీటీసీకి వెళ్లే రోడ్డు, బ్రిడ్జి నుంచి సర్వీస్‌రోడ్డు, లక్ష్మీనగర్‌కు వెళ్లే రహదారులను బారికేడ్లు వేసి మూసివేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఇక బయటి నుంచి చూస్తున్న వారిని సైతం అక్కడి నుంచి పోలీసులు పంపివేయడం గమనార్హం.



అభ్యర్థులకు పరుగు పందెం

సినీ రంగానికి వజ్రాభరణం ఎన్టీఆర్: వీసీ



మాట్లాడుతున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ రంగానికి విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు వజ్రాభరణమని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. సోమవారం ఎస్కేయూలో సినీగేయ వజ్రోత్సవ సదస్సును నిర్వహించారు. తెలుగు తులనాత్మక సాహిత్య శాఖ, మహాబోధి సాహిత్యశాఖ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటుచేసిన సదస్సుకు వీసీ ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జేవీ సత్యవాణి, నరసింహన్, బాలసుబ్రహ్మణ్యం, సదాశివరెడ్డి, సాహితీవేత్త పతికి రమేష్ నారాయణ, అకడమిక్ కన్సల్టెంట్స్ నాగేంద్ర, పీడీఎఫ్ బత్తల అశోక్, పరిశోధక విద్యార్థులు అరుణ్‌కుమార్, శ్రీలత, మునిస్వామి, రామాంజినేయులు, సంపత్‌కుమార్, బాలచంద్ర, డిగ్రీ లెక్చర్లు శ్రీనివాసులు, యోగేశ్వరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.6లక్షల సామగ్రి వితరణ

అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సిండికేట్ నగర్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో రూ. ఆరు లక్షల విలువచేసే సామగ్రిని వితరణ చేశారు. స్థానిక బ్రాంచ్ మేనేజర్ దేవరాజు ఆధ్వర్యంలో రెండు ల్యాబ్ టేబుళ్లు 10 ల్యాబ్ స్టూళ్లు, 85 డెస్కులు, మూడు బీరువాలు, ర్యాకను సోమవారం పాఠశాలలో అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు దివాకరరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

రస్తా వదిలేలా చర్యలు తీసుకోండి

అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రస్తా వదిలేలా చర్యలు తీసుకోవాలని రుద్రంపేట పంచాయతీ మదర్ థెరిసా కాలనీవాసులు పేర్కొన్నారు. ఆ మేరకు సోమవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజాకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రుద్రంపేట పంచాయతీలోని కక్కలపల్లి గ్రామ సర్వే నెం. 87లో 2012లో 78 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. 1, 2 ప్లాట్ల మధ్యలో 15 అడుగుల రస్తా ఇచ్చారని, అయితే ఇటీవల రెండో ప్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తి రోడ్డు లేదని చెబుతున్నాడని తెలిపారు. దీంతో స్థానికంగా నివాసముంటున్న తమకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించి రస్తా వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

● వామపక్ష నాయకులు



మాట్లాడుతున్న జాఫర్, పాల్గొన్న ఇతర వామపక్ష నేతలు

అనంతపురం విద్య, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచితంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అధ్యక్షతన సోమవారం సీపీఐ,సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఎస్‌యూసీఐ పార్టీల నాయకులు క్లాక్‌టవర్ నుంచి గాంధీ విగ్రహం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమో క్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎస్‌యూసీఐ నాయకులు రాఘవేంద్ర హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఇతర నాయకులు లింగమయ్య, రమణయ్య, సంతోషకుమార్, పద్మావతి, నారాయణస్వామి, మునాఫ్, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పీ నారాయణస్వామినాయకులు చాపల రామాంజి, నాగరాజు, సుధాకర్, పెద్దపెద్దయ్య, నారాయణప్ప, సూరి తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: కేంద్ర హోం మంత్రి పదవి నుంచి అమిత్‌షాను తొలగించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ మండల నాయకులు సోమవారం మండలకేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రామక్రిష్ణ,మండల నాయకులు శివ, రామాంజనేయులు, సరస్వతి, గోవిందు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

అనంతపురం క్రైం,డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ హత్య కేసులో బుక్కరాయసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనంతసాగర్ కాలనీకి చెందిన మరూరు రత్నమయ్యకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. బుక్కరాయసముద్రం మండలం అనంతసాగర్‌కాలనీకి చెందిన వినోద్ కుమార్‌ను 2022 ఏప్రిల్ 14వతేదీ రాత్రి అదే కాలనీకి చెందిన రత్నమయ్య కత్తితో ఛాతిపై పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటనపై అప్పటి సీఐ రాము దర్యాప్తు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున ఎనిమిది మంది సాక్షులను విచారించగా రత్నమయ్యపై నేరం రుజువు కావడంతో అతడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా న్యాయాధికారి సంచలన తీర్పు వెలువరించారు. అప్పటి సీఐ రాము, కోర్టు మానిటరి సిస్టం సీఐ వెంకటేష్‌నాయక్, ఏఎస్ఐ మల్లిరెడ్డి, కానిస్టేబుళ్లు రామమోహన్, ప్రదీప్‌కుమార్, లైజన్ ఆఫీసర్ శ్రీనివాసులను ఎస్పీ జగదీష్ అభినందించారు.

శాస్త్రోక్తంగా గోదా కల్యాణం



కల్యాణోత్సవంలో గోదా రంగనాయకులు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం సాయంత్రం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయంలో గోదారంగనాయక స్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలోని వేదికపై గోదాదేవి, రంగనాయక స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్ బాబు, సత్యప్రసాద్, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, భక్తులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరస్వామిని దర్శించుకున్న ఎస్పీ



ఎస్పీ దంపతులను ఆశీర్వదిస్తున్న ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి

అనంతపురం కల్చరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్పీ జగదీష్ కుమార్ సోమవారం సాయంత్రం కుటుంబ సమేతంగా మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వరాలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు కాశీవిశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్పీ దంపతులకు స్వామివారి శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



సీఎం చంద్రబాబుకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. విజయవాడలో సీఎంను ఎమ్మెల్యే సోమవారం కలిసి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు. నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ సభ్యత్వ నమోదుపై సీఎం ఆరా తీయగా, లక్ష్యానికి అనుగుణంగానే సభ్యత్వ నమోదు జరుగుతోందని ఎమ్మెల్యే వివరించారు. అర్బన్ నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి ఆయన తీసుకెళ్లగా, నగరాభివృద్ధికి సంబంధించి అన్ని అంశాలను పరిశీలిస్తున్నామని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

నేడు ఎమ్మెల్యే దగ్గుపాటి పింఛన్ల పంపిణీ

అనంతపురం అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మంగళవారం అర్బన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఉదయం 7 గంటలకు 20వ డివిజన్‌లోని పవర్ ఆఫీస్ సమీపంలోని మోమిన్ బజార్‌లో పింఛన్లు పంపిణీ చేస్తారు. ఆ తర్వాత 7.45 గంటలకు ఖాజానగర్, 8.30కు అరుణోదయ కాలనీ జెండా కట్ట వద్ద పంపిణీ చేస్తారు. అలాగే 9.15కు 42వ డివిజన్‌లో ఆరో రోడ్డు నాగుల కట్ట వద్ద, 10 గంటలకు 41వ డివిజన్‌లోని హైదర్ నగర్ కాలనీలో ఎమ్మెల్యే పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

నేడు ఎమ్మెల్యే పరిటాల సునీత రాక

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరియన్ చెరువు గ్రామానికి ఎమ్మెల్యే పరిటాల సునీత మంగళవారం రానున్నారని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. గ్రామంలో చేపట్టను న్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్య క్రమానికి ఎమ్మెల్యే హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 7.30గంటలకు గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి



మాట్లాడుతున్న దేవళ్ల మురళి, నాయకులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షే మమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి పేర్కొన్నారు. స్థానిక టీ ఎన్ టీ యుసీ కార్యాలయంలో సోమవారం దేవళ్ల మురళి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండరామిరెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు కార్మికులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. జనవరి నుంచి రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. టీడీపీ హయాంలోనే ఉమ్మడి జిల్లాలో కియ పరిశ్రమను స్థాపించి, వేల మంది యువతకు ఉపాధి కల్పించారన్నారు. రానున్న రోజుల్లో జిల్లాకు మరిన్ని పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

దళితులకు ఇళ్ల పట్టాలివ్వాలి

అనంతపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల గ్రామంలో నివాసముంటున్న దళితులకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని సీపీఐ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆ మేరకు బాధితులతో కలసి సోమవారం అనంతపురం రూరల్ మండలం తహసీల్దార్ మోహన్‌కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండల కార్యదర్శి రమేష్, నాయకులు ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కులగణనను పారదర్శకంగా చేపట్టాలి

రామగిరి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణనపై జనవరి 10వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారని, దానిని నిష్పక్షపాతంగా వేగవంతంగా నిర్వహించాల ని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే లింగమయ్య, నాయకులు నాగభూషణ తదితరులు సోమవారం తహసీల్దార్ జమాల్ ఉల్లాఖాన్, ఎంపీడీఓ చంద్రమౌళిని వారివారి కార్యాలయాల్లో కలిసి వినతిపత్రాలు అందజేశారు.

క్లుప్తంగా..

ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం


గుంతకల్లులో ర్యాలీ చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

రాయదుర్గంరూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ మోడల్ పాఠశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మాజీ అధ్యక్షుడు ఆవుల మనోహర్ హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ పోరాటాలలో అనేకమంది ఎస్ఎఫ్ఐ నాయకులు అశువులు బాశారన్నారు. కేంద్రం ప్రభుత్వం విద్యావిధానాన్ని భ్రష్టుపట్టిస్తోందని మండిపడ్డారు. విద్య వ్యాపారం అయిందని, అయినా ప్రభుత్వాలు నోరు మెదపడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మహిళా నాయకురాలు పద్మ, హెచ్ఎం అశోక్‌రెడ్డి, నాయకులు వలి, అనిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల ర్యాలీ

గుంతకల్లుటౌన్: ఎస్ఎఫ్ఐ 55ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలో నాయకులు సోమవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పొట్టిశ్రీరాములు సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పరమేష్ మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు నెలకొన్న విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, సహాయ కార్యదర్శి భీమేష్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణకు పేర్లు నమోదు చేసుకోండి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చేతివృత్తులపై శిక్షణ పొందేందుకు పేర్లను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ముఖ్యమంత్రి మార్గదర్శకాల ప్రకారం ఒక కుంటుంబం ఒక వ్యాపార వేత్త వాక్‌టూ వర్క్‌లో భాగంగా మహిళా సంఘాలలోని సభ్యులకు కానీ, వారి కుటుంబసభ్యుల్లో ఎవరైనా ఒకరికి కానీ ఏసీ, రిఫ్రిజిరేటర్,వాషింగ్‌మిషన్, వాటర్ పూరిఫైర్,గీజర్, వడ్రంగి, ప్లంబింగ్, విద్యుత్, సెలూన్, బ్యూటీషియన్ కోర్సులకు శిక్షణ ఇస్తారన్నారు. జనవరి4లోపు మున్సిపల్ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9493536176, 9493536504 కు సంప్రదించాలన్నారు.

ఎస్సీల జాబితాపై అభ్యంతరాలు తెలపండి

గుంతకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్సీల వర్గీకరణ అంశంగా తయారు చేసిన జనాభా వివరాలపై ఏవైనా అభ్యంతరాలుంటే మంగళవారం సాయంత్రం లోపు తెలియజేయాలని తహసీల్దారు రమాదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. గుంతకల్లు మండలంతో పాటు పట్టణంలో ఉన్న ఎస్సీల జాబితాను తయారుచేశామని, జాబితాపై అభ్యంతరాలు వస్తే వాటిని పరిష్కరించి, ఎస్సీ కుల వర్గీకరణ కార్యక్రమాన్ని చేపడతామని తెలియజేశారు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో 6088 మంది, పట్టణంలో 23,165 మంది ఎస్సీ జనాభా ఉన్నట్లు తమ లెక్కలో తేలిందని అన్నారు. ఆ జాబితాలో ఎస్సీయేతరులు ఉంటే అభ్యంతరాలను తెలపవచ్చని ఆమె కోరారు.

గ్రామాల్లో వైద్యాధికారి పర్యటన

బ్రహ్మసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్దలాపురం, బొమ్మగానిపల్లి గ్రామాలలో సోమవారం వైద్యాధికారి రాజేష్‌కుమార్ పర్యటించారు. ముందుగా ముద్దలాపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా నడవలేని స్థితిలో ఉన్న వారి ఇంటికి వెళ్లి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తరువాత ముద్దలాపురం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులను పరీక్షించి గుండె జబ్బుతో బాధపడుతున్న ఇద్దరు చిన్నారులను సర్జరీ కోసం అనంతపురం జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. తరువాత బొమ్మగానపల్లి సచివాలయం సందర్శించి వైద్య సిబ్బంది రికార్డులు తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలు దీప్తి మృదుల, ఏఎన్ఎంలు సంగీత, వన్నూరమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ఉరవకొండ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన నిధులను విడుదల చేయాలని కోరుతూ పట్టణంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆందోళన చేపట్టారు. పాత బస్టాండ్ కూడలిలో అరటి పండ్లు, కూరగాయలను అమ్ముతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.2100కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, రూ.1480కోట్ల వసతి దీవెన నిధులను విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యాసంస్థలకు డబ్బులు రాలేదని, దీంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు వేధిస్తున్నాయని అన్నారు. తక్షణమే నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు మంజునాథ్, వంశీ, చందు, రాజు, లెనిన్, రాజేష్, సాగర్, లాల్‌స్వామి, జగదీష్, నిరంజన్ పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలను కూల్చేయాలి

ఉరవకొండ,డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన పంచాయతీ స్థలాల్లో వైసీపీ సర్పంచ్ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నా.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, కార్యదర్శి గౌస్‌పై వార్డు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయంలో సోమవారం పంచాయతీ సర్వ సభ్యసమావేశం సర్పంచ్ లలితమ్మ అధ్యక్షతన జరిగింది. అజెండాలోని అంశాలను చదివి వినిపించారు. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వార్డు సభ్యులు రవి, ప్రభాకర్, రామాంజినేయులు పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. అనుమతి లేని వాటిని కూల్చాలని డిమాండ్ చేశారు. వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు వినతి

గుంతకల్లుటౌన్,డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన కూడలిలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ సోమవారం అనంతపురంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డీ జగదీష్ ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో రోడ్లు ఇరుకుగా ఉన్నాయని, ట్రాఫిక్ సమస్యతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గాంధీచౌక్, ఎన్టీఆర్, పొట్టిశ్రీరాములు, బీరప్ప, హనుమాన్ సర్కిల్‌లలో ఆక్రమణలను తొలగించాలన్నారు. రోడ్లను వెడల్పు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆయన కోరారు.

తాగునీటి సమస్య తీర్చండి

● ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

కళ్యాణదుర్గం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కంబదూరు మండల పరిధిలోని అండేపల్లిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దీంతో గుక్కెడు నీరు దొరక్క తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ మహిళలు సోమవారం ఖాళీబిందెలను చేతపట్టుకుని స్థానిక రోడ్డుపై బైఠాయించి వాహనరాకపోకలను నిలిపివేసి ఆందోళన చేపట్టారు. ఒకటిన్నర నెల నుంచి గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందని మహిళలు వాపోయారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. సుమారు రెండు గంటలపాటు ప్రధాన రహదారిలోనే వాహనరాకపోకలు నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్పందించిన ఈవో ఆర్డీ గూడెన్న రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించుకున్నారు.


రోడ్డుపై ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం

● సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ కాలవ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అత్యంత వెనుకబడిన గుమ్మఘట్ట మండల అభివృద్ధికి స్థానిక మండల సభ్యులు, సర్పంచులు అందరూ పార్టీలక అతీతంగా సమష్టి కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఎంపీపీ భవానీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విప్ కాలవ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండల అభివృద్ధి కోసం తాను సీఎంతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తున్నానన్నారు. ఇప్పటికే రూ.698 కోట్ల నిధులతో బీటీపీ రిజర్వాయర్‌కు హంద్రీనీవా జలాలను అందించేందుకు కృషి చేస్తున్నామని, 30 శాతం పనులు కూడా పూర్తి చేశామని అన్నారు. వచ్చే రెండేళ్లలో మండలంలో గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడిపేందుకు తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచులు కూడా సహాయ సహకారాలు అందించాలని, గ్రామాల అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ తనను సంప్రదించాలని కోరారు. అనంతరం శాఖల వారీగా మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహిస్తుండగా.. ఆరోగ్యశాఖ అధికారులు అందించిన నివేదిక తనకే అర్థం కావడం లేదని, ఇక సభ్యులకు, సర్పంచులకు ఏమి అర్థమవుతాయని వైద్యాధికారి బాలాజీనాయక్‌పై కాలవ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోగ్యశాఖ కీలకమైనదని, ఇలాంటి తప్పుడు నివేదికలను ఇచ్చి మభ్యపెట్టవద్దని హెచ్చరించారు. రెవెన్యూ సమస్యలను గలగల, కేపీదొడ్డి సర్పంచులు రమేష్, సిద్ధన్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులును ప్రభుత్వ విప్ ఆదేశించారు. సమావేశం అనంతరం సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ రామకృష్ణుడు, మండల ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, ఇతర మండలశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

● వామపక్షాల డిమాండ్



గుంతకల్లులో ర్యాలీ చేస్తున్న వామపక్ష నాయకులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తూ తాడిపత్రి, గుంతకల్లు, ఉరవకొండ, గుత్తి, రాయదుర్గం పట్టణాలతో పాటు పామిడి, కూడేరు మండలకేంద్రాల్లో సోమవారం సీపీఐ, సీపీఎం, సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్, బీఎస్పీ తదితర పార్టీలతో పాటు ప్రజా సంఘాల నాయకులు ప్రధాన వీధుల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. అలాగే అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంపై ప్రమాణం చేసిన అమిత్‌షా ఆయన గురించే అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని అన్నారు. వెంటనే అమిత్‌షా దేశప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. లేకుంటే కేంద్రమంత్రి పదవి నుంచి ఆయన్న తొలగించాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలపై కఠినంగా వ్యవహరించాలి

కూడేరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి సూచించారు. మండలకేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం, బాల్య వివాహాలపై అంగన్వాడీ వర్కర్లకు, గ్రామ మహిళా సంరక్షకులకు అవగాహన సదస్సు జరిగింది. ఇందులో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం వల్ల బాలికలు శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతారన్నారు. చదువుకోవాల్సిన వయసులో వివాహం చేయడం నేరమన్నారు. బాల్యవివాహాలు చేసిన వారితో పాటు ప్రోత్సహించే వారిపై కూడా కేసులు నమోదవుతాయన్నారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సర్పంచు లలితమ్మ, ఐసీడీఎస్ సీడీపీలు శ్రీదేవి, యల్లమ్మ, ఎంఈఓ గౌస్‌మొద్దీన్, సూపర్‌వైజర్లు రాజేశ్వరీ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

అర్చకత్వం చేసుకోనివ్వండి సారూ..

● దేవదాయశాఖ అధికారులకు అర్చకుడు రాజన్న విన్నపం


రాజన్న

విడపనకల్లు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన బసవేశ్వర, రామలింగేశ్వర ఆలయ అర్చకుడిగా ఉన్న తనను ఎటువంటి ఆరోపణలు లేకుండానే విధుల నుంచి తొలగించారని, న్యాయం చేయాలని పూజారి రాజన్న కోరారు. మండలకేంద్రంలో సోమవారం ఆయన తన ఆవేదనను వెళ్లగక్కారు. 2000వ సంవత్సరం నుంచి బసవేశ్వర, రామలింగేశ్వర ఆలయంలో అర్చకుడిగా ఉన్న తనను వైసీపీ నాయకులు కక్ష సాధింపుతో గత 2023జూలైలో విధుల నుంచి తొలగించారన్నారు. పాల్తూరు ఆలయంలో ఐదుగురు అర్చకులు ఉన్నామని, అయితే అందులో తనను గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల మాట వినలేదని కక్ష కట్టి విధుల నుంచి తొలగించారని తెలిపారు. న్యాయం కోసం ఏడాది కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. ఏఒక్కరూ పట్టించుకోలేదని వాపోయారు. గత నవంబరులో దేవాదాయ శాఖ కమిషనర్‌కు పోస్టు ద్వారా ఫిర్యాదు చేశానని, అందుకు ఇటీవల తూతూ మంత్రంగా విచారణ జరిపి మిన్నకుండిపోయారని ఆవేదన చెందారు. వైసీపీ నాయకుల కుట్రకు మా కుటుంబం వీధిన పడాల్సి వచ్చిందని విలపించారు. తనకు న్యాయం చేసి అర్చకుడిగా విధులు నిర్వహించుకునేందుకు అనుమతులు ఇవ్వాలంటూ ఆయన దేవాదాయ శాఖ జిల్లా అధికారులను కోరారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



కళ్యాణదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

గుంతకల్లు టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శాంతిలాల్ చాంబర్‌లో సీనియర్ న్యాయవాది శేషాద్రి అనుమానాస్పదంగా మృతి చెందడంతో పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో సోమవారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ సీఐ శాంతిలాల్‌ను సస్పెండ్ చేయాలన్నారు. దీనిపై పూర్తిగా విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులకు ప్రొటెక్ట్ యాక్ట్ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు బీఎస్ కృష్ణారెడ్డి, భాస్కర్‌గౌడ్, వీ నాగరాజు, లక్ష్మన్న, ఆర్‌బడే సాబ్, సత్యనారాయణ, గురుప్రసాద్, సురేష్‌కుమార్, శివరావు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: పట్టణంలోని కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి మాట్లాడుతూ అనంతపురంలో న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధులను బహిష్కరించిన వారిలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సీనియర్ న్యాయవాదులు దద్దం సుబ్బయ్య, మునయ్య, ఆర్‌సీ రజనీకాంత్‌రెడ్డి, శివయ్య, కుమారస్వామి ఉన్నారు.

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని కోర్టు వద్ద న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు విధులను బహిష్కరించి టీ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం పట్టణంలో సీనియర్ న్యాయవాది శేషాద్రి మరణానికి కారకులైన త్రీటౌన్ పోలీసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు దేవేంద్రప్ప, సంజీవప్ప, తిమ్మప్పచౌదరి, హరిచక్రవర్తి, బంగి రవికుమార్, ముత్యాలప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలకు జేసీ పార్క్ సిద్ధం


విద్యుత్‌లైట్ల నడుమ మెరిసిపోతున్న పార్కు

తాడిపత్రి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యూఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి భారీ ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీ పార్కులో సాయంత్రం 7:30గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు వేడుకలు జరుగుతాయన్నారు. కేవలం మహిళలకు, చిన్నారులకు మాత్రమే అనుమతి ఉందన్నారు. మహిళలను తక్కువ అంచనా వేయరాదన్నారు. ప్రస్తుతం వారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలు ఇంటికే పరిమితం కాకూడదని వేడుకలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య


రాజేష్(ఫైల్)

గుత్తిరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శ్రీపురం గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పులి శేఖర్, సరోజ దంపతుల కుమారుడు రాజేష్ (22) ట్రాక్టర్ హమాలి పని చేస్తుండేవాడు. అయితే ఎంత అడుగుతున్నా.. ఇంట్లోవాళ్లు బైకు కొనివ్వడం లేదని మదనపడుతుండేవాడు. ఈ క్రమంలో సోమవారం తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నాడు. స్థానికులు గుర్తించి వెంటనే కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తాడిపత్రి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ శివరామకృష్ణ సోమవారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కౌన్సిలర్లు తప్పక హాజరుకావాలని సూచించారు.

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ జబ్బర్‌మియా సోమవారం ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

చీనీ చెట్లు దగ్ధం

పామిడి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పాజిపేట గ్రామంలో పరమేశ్వరప్పకు చెందిన చీనీ చెట్లు ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామంలోని కొండ సమీపాన గల ఎకరా పొలంలో సుమారు 220 చీనీచెట్లు నాలుగున్నర ఏళ్లుగా సాగుచేస్తున్నారని, ఏడాది ఉంటే కాపునకు వచ్చేవని అన్నారు. కొండలో నుంచి అగ్ని తన చీనీతోటకు అంటుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో డ్రిప్పు పరికరాలు, పైపులతో పాటు చీనీ చెట్లు కాలిపోయాయన్నారు. ఈ సంఘటనతో సుమారు రూ. 2లక్షలు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. తమను ఆదుకోవాలని తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి

రాయదుర్గంరూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీకి చెందిన దుగ్గప్ప(59) సోమవారం మండలంలోని 74 ఉడేగోళం మద్దానేశ్వర స్వామి దేవాలయం సమీపంలో నీటికుంటలో పడి మృతి చెందాడు. దుగ్గప్ప కట్టెలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. అయితే అతడికి అప్పుడప్పుడు మూర్ఛ వస్తుండేది. రెండురోజుల క్రితం ఇంటి నుండి బయటకు వెళ్లిన అతను 74 ఉడేగోళంలోని మద్దానేశ్వరస్వామి ఆలయం సమీపంలో నీటికుంటలో పడి మృతి చెందాడు. గొర్రెలకాపరులు శవాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

బ్రహ్మసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొంచిరెడ్డిపల్లి అటవీ ప్రాంతంలో పేకాటాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. సమాచారం అందడంతో దాడులు చేసి వారిని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. అలాగే వారి నుంచి రూ. 8720ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

బొమ్మనహాళ్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలో ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ మునివేలు, ఎస్ఐ నబీరసూల్ సూచించారు. మండలంలోని బండూరు గ్రామ ఆర్డీటీ కాలనీలో గ్రామస్థులకు సోమవారం ఆయన పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలను రక్షించేందుకు రాజ్యాంగంలో ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఈ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన ఉండాలని తెలిపారు. ప్రస్తుతం సైబర్‌నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌ను పట్టించుకోవద్దని తెలిపారు. అలాగే గ్రామాలలో ఒకరికొకరు కలిసి జీవనాన్ని సాగించాలని, గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పారావు, వీఆర్వో నాగరాజు రావు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

శెట్టూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చంద్రమౌళి దేవాలయంలో సోమవారం అమావాస్య ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణలు, పూజలు, చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు పొందారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

● పోస్టల్ రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరెడ్డి

యాడికి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోస్టల్ కర్నూలు రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరెడ్డి తెలిపారు. రాయలచెరువులోని సబ్ పోస్టాఫీస్‌ను సోమవారం ఆయన తనిఖీచేశారు. సేవింగ్స్‌ఖాతాలు తదితర సేవలపై సిబ్బందిని ఆరాతీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ.. పోస్టాఫీసుల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. పోస్టల్ పొదుపుఖాతాలు, ఇన్సూరెన్స్ సౌకర్యం, పోస్టల్ బ్యాంక్ సేవలు అందించడంలో మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో పోస్ట్‌మాస్టర్ రంజన్‌రెడ్డి, సిబ్బంది మహబూబ్‌బాషా, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

● ప్రజలకు పోలీస్ అధికారుల సూచన

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ప్రజలు పోలీసు ఆంక్షలను పాటించాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు, రాయదుర్గం సీఐ జయనాయక్, యాడికి సీఐ ఈరన్న, గుంతకల్లు వన్‌టౌన్ సీఐ మనోహర్, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తదితరులు సోమవారం విలేకరుల సమావేశాల్లో, ప్రకటనలలో వేర్వేరుగా హెచ్చరికలు జారీ చేశారు. పట్టణాలు, మండలకేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైతం న్యూఇయర్ వేడుకలను ఇళ్ల వద్ద కుటుంబసభ్యులతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. మంగళవారం రాత్రి 10 గంటల నుంచి పోలీస్ 30 యాక్టు అమల్లో ఉంటుందన్నారు. పబ్లిక్ స్థలాల్లో టపాసులు కాల్చరాదన్నారు. త్రిబుల్‌రైడింగ్, ఓవర్‌స్పీడ్‌తో ద్విచక్రవాహనాలు నడపరాదన్నారు. రోడ్లపై కేక్‌కట్టింగ్‌లు చేయరాదన్నారు. ఎవరైనా అలా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సన్నిహితులు, కుటుంబసభ్యులతో ప్రశాంతంగా వేడుకలను ఇళ్ల వద్ద జరుపుకోవాలని సూచించారు. 31వ తేదీ రాత్రి నుంచి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రధాన కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు చేపడతామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి రూ.10వేలు జరిమానా లేదా ఆరునెలల జైలు శిక్ష ఉంటుందన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇవ్వకుండా జాగ్రత్త పడాలని వారు సూచించారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

తాడిపత్రి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ వాడడం వల్ల కలిగే ప్రయోజనాలపై డీఎస్పీ రామకృష్ణుడు ఆధ్వర్యంలో సోమవారం పోలీసులు పట్టణంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్ఐ కాటయ్య, పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాలపై రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి పట్టణంలోని నందలపాడుబ్రిడ్జి వరకు అక్కడి నుంచి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీ నిర్వహించారు. ద్విచక్రవాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్లు తప్పనిసరిగా వాడాలని కోరారు. ర్యాలీలో పెద్దపప్పూరు ఎస్ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు


టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నాయకులు

పుట్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట, కందికాపుల గ్రామాల్లో సోమవారం టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టారు. సర్పంచు శివరామయ్య ఆధ్వర్యంలో వారు ఇంటింటా తిరిగి ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వ నమోదు చేయించుకోవాలని తెలిపారు. కేవలం వంద రూపాయలు చెల్లించి సభ్యత్వం పొందితే రూ.5లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందని ప్రజలకు వివరించారు. ఇప్పటికే 250మందికి సభ్యత్వం చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

పప్పుశనగ రైతులను ఆదుకోండి

పుట్లూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు నష్టపోయిన పప్పుశనగ రైతులను ఆదుకోవాలని కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కందికాపుల, చింతకుంట గ్రామాల్లో నష్టపోయిన పంటలను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ తుఫాన్ వల్ల వందల ఎకరాల్లో శనగ పంట దెబ్బతినిందన్నారు. నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఇప్పటికే రైతులు పెట్టుబడులు పెట్టి నష్టపోయారన్నారు. గతేడాది కూడా పంటనష్టం జరగగా ఎలాంటి పరిహారం ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అయినా స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఆయన వెంట బాలగురయ్య, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే అమిలినేనితోనే కురుబలకు న్యాయం

కళ్యాణదుర్గంరూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని కురుబలకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుతోనే న్యాయం జరుగుతుందని కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నీలాస్వామి అన్నారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఉషశ్రీచరణ్ సొంత కులస్థులపైనే కేసులు పెట్టించారన్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో కనకదాసు సర్కిల్ ఏర్పాటుతో పాటు రూ. 12 లక్షలు వెచ్చించి కనకదాసు విగ్రహం ఏర్పాటు చేయించారన్నారు. అలాగే కళ్యాణమండపం పూర్తి చేయడం కోసం అమిలినేని చొరవతో హిందూపురం ఎంపీ పార్థసారథి రూ.20 లక్షలు ఇవ్వడం శుభపరిణామమన్నారు. కురుబ కులస్థులు పాల్గొన్నారు